

అక్షరశక్తి
The Power of Pen
Evening Daily

సంపుటి: 20 | సంచిక: 296 | వరంగల్ | శనివారం, 29 ఆగస్టు 2026 | పేజీలు: 7

# పోస్టర్లు అతికించా!

# ప్రజాప్రతినిధిగా ఎదిగా!!

## విద్యార్థి దశ నుంచి రాజకీయాలు

- న్యాయం కోసం కొట్లాటకు పోతే రౌడీ అన్నారు
- ఉద్యమాల ఓనమాలతో చదువు ఆగింది
- ఇంటర్ నుండి ఇంట్లో డబ్బులే అడగలేదు
- పావలా ఇడ్లీ తిన్న...వెయ్యి రూపాయల ఇడ్లీ తిన్న
- కాంగ్రెస్ పార్టీకి డ్రగ్ అడిక్ట్ లాగా అయ్యాను
- వేరే కండువా ఊహించను
- నా ఫ్యామిలీ కాంగ్రెస్ ఫ్యామిలీ
- ఇప్పుడు హ్యాపీ... ఇంకా ఏది వచ్చినా అది బోనస్



చదువులో ఎప్పుడూ వెనకే...కానీ స్నేహితుల కోసం అందరికంటే ముందు ఉండేవాడు. అన్యాయం జరిగితే చూస్తూ ఉండేవాడు మంచి వాడు ఐతే, కోట్లాడే వాడు రౌడీ అన్నా.. పద్ధతి మార్చుకోలేదు. స్కూలింగ్, ఇంటర్ లోనే నాయకత్వ లక్షణాలు.. ఆపై ఆర్ట్స్ కళాశాల డిగ్రీ ఫస్ట్ ఇయర్ లోనే స్టూడెంట్ లీడర్ అయ్యాడు... ఇప్పుడు ఎమ్మెల్యే గా ఎదిగాడు నాయిని రాజేందర్ రెడ్డి. ఎన్నో పోరాటాల మలుపులు.. రాజకీయ మజిలీలు ఆయన చరిత్రలో ఉన్నాయి. లై పెట్టి, పోస్టర్ అతికించి, పదకొండు ఏళ్ళు ప్రతిపక్షంలో సవాళ్లను అధిగమిస్తూ ఎదిగాడు. ఇప్పుడు అధికార పార్టీ ఎమ్మెల్యేగా పశ్చిమ నియోజక వర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలతో దూసుకుపోతున్నాడు. నా మెడలో వేరే కండువా ఊహించను అని చెప్తూ... కాంగ్రెస్ పార్టీకి డ్రగ్ అడిక్ట్ అయ్యానని అంటున్నాడు. శనివారం నాడు డిజిటల్ మీడియా ప్రతినిధులతో నాయిని తన అంతరంగాన్ని పంచుకున్నాడు.

- అక్షరశక్తి, ప్రధాన ప్రతినిధి



SPECIAL PAGE

## ఎస్ఐఆర్‌పై సీఈసీకి సీఎం రేవంత్ లేఖ

- దాదాపు 92.86 లక్షల ఓట్ల తొలగింపుపై ఆందోళన
- దీనిపై సమగ్ర పరిశీలన అవసరం
- అదనపు సమయం ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి



3




## సీజనల్ వ్యాధులను తేలిగ్గా తీసుకోవద్దు

- కేసులు పెరుగుతున్న జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- అవసరమైన పరీక్షలు, చికిత్స అందించాలి
- ప్రతి శుక్రవారం 'డ్రై డే' అమలు చేయాలి
- మంత్రి దామోదర రాజనర్సింహ
- ఆరోగ్య శాఖ అధికారులతో సమావేశం

4

## ఫీజు బకాయిలతో విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం

- రాష్ట్రంలో 40 లక్షల మంది విద్యార్థుల పరిస్థితి ప్రశ్నార్థకం
- రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి
- లేకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తాం
- బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మారెడ్డి



5

## కోటను సందర్శించిన దక్షిణ మధ్య రైల్వే జీఎం



**అక్షరశక్తి,వరంగల్:** చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచిన ఓరుగల్లు కోటను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవత్సవ, ఆయన సతీమణి శనివారం సందర్శించారు. సికింద్రాబాద్ డీఆర్ఎం డాక్టర్ గోపాల కృష్ణన్‌తో కలిసి కోటలోని స్వయంభు ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ పర్యాటక శాఖ గైడ్ దేనబోయిన రవి యాదవ్ కోటలోని నాలుగు కళా తోరణాలు, వివిధ శిల్పకళా ఖండాలు, వాటి చారిత్రక ప్రాశస్త్యాన్ని వారికి వివరించారు. ఓరుగల్లు కోట గొప్ప చారిత్రక నేపథ్యంతో పాటు అద్భుతమైన శిల్పకళా సంపదకు నిలయంగా ఉందని జీఎం సంజయ్ కుమార్ శ్రీవత్సవ కొనియాడారు. అనంతరం ఏకశిలా కొండపైకి వెళ్లి అక్కడి నుంచి వరంగల్ నగర అందాలను వీక్షించారు. అనంతరం కుష్ మహల్, శృంగార బావి, అక్కాచెల్లెళ్ల బావి, రాతికోటపై ఉన్న సెంట్రీ టవర్ తదితర చారిత్రక కట్టడాలను సందర్శించారు. ఈ పర్యటనలో రైల్వే పోలీస్ అధికారులు, రైల్వే అధికారులు, కేంద్ర పురావస్తు శాఖ కోఆర్డినేటర్ శ్రీకాంత్‌తో పాటు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వృద్ధులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ



**అక్షరశక్తి,భీమారం:** 55వ డివిజన్ భీమారంలో తెలంగాణ ఉద్యమకారుడు ఆకుల కుమార్ సోదరుడు కీర్తిశేషులు ఆకుల రాజేందర్ వర్ధంతిని పురస్కరించుకుని సేవా కార్యక్రమం నిర్వహించారు. భీమారంలోని లార్డ్ అనాథ వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఆకుల రాజేందర్ జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతృప్తినిస్తుందని తెలిపారు. వృద్ధులకు అండగా నిలవడం, వారి అవసరాలను గుర్తించి సహాయం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బండారి సుభాష్, ఆకుల సదానందం, మార్క రాజు, రాయికంటి సురేష్, ఆకుల రాహుల్, రోహిత్, శ్రీపాణి, ఆకుల ధర్మతేజ, సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ భాషను మరవొద్దు..

**అక్షరశక్తి, హనుమకొండ:** తెలుగు జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ కమిషనరేట్‌కు చెందిన పోలీస్ హెడ్ కానిస్టేబుల్ జి. జయరాజు లష్కర్ బజార్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పెద్దబాల శిక్ష పుస్తకాలను అందజేశారు. విద్యార్థుల్లో తెలుగు భాషపై అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ.. విద్యార్థులు ఇతర భాషలను నేర్చుకోవడంతో పాటు తమ మాతృభాష అయిన తెలుగును కూడా గౌరవించి, ప్రేమించాలని అన్నారు. పరభాషలను నేర్చుకోవడం అవసరమే అయినప్పటికీ, అమ్మ భాషను ఎట్టి పరిస్థితుల్లోనూ మరవకూడదని సూచించారు. తెలుగు భాష గొప్పతనాన్ని, సంస్కృతి, సాహిత్య విలువలను విద్యార్థులు తెలుసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు కె. రమాదేవి, గ్రంథాలయ ఇన్‌చార్జి బి. నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



# మనం అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి






- హనుమకొండను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా అడుగులు...
- క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతుల కల్పనకు చర్యలు
- వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని...

**అక్షరశక్తి,హనుమకొండ:** విద్య, వైద్యం, క్రీడారంగాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, హనుమకొండలో క్రీడా మౌలిక వసతులను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసి ఈ ప్రాంతాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు అన్నారు. శనివారం హనుమకొండలో అభివృద్ధి చేసిన స్విమ్మింగ్ పూల్‌ను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, హనుమకొండ జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్ తదితరులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం జేఎన్ఎస్ ఇండోర్ స్టేడియంలో పునర్నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న బ్యాడ్మింటన్ స్టేడియంను ప్రారంభించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇండోర్ స్టేడియం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్, హనుమకొండ జేఎన్ఎస్ అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వరంగల్ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. గత రెండున్నరేళ్లలో వరంగల్, హనుమకొండ జిల్లాల్లో విద్య, వైద్యం, క్రీడలు, మౌలిక వసతులు తదితర రంగాల్లో గణనీయమైన అభివృద్ధి జరిగిందని తెలిపారు. జేఎన్ఎస్‌లో క్రీడాకారుల కోసం కల్పించిన ఆధునిక సదుపాయాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని క్రీడాకారులకు సూచించారు.

క్రీడాకారులకు అవసరమైన మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికే ఉన్న ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ వంటి సదుపాయాలను మరింత అభివృద్ధి చేయడంతో పాటు స్పోర్ట్స్ స్కూల్‌కు సొంత భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. క్రీడల్లో సాధించే ప్రతి విజయం క్రీడాకారుడి వ్యక్తిగత విజయమే కాకుండా కుటుంబానికి, ప్రాంతానికి, జిల్లాకు, రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండున్నరేళ్లలో వరంగల్ ప్రాంత అభివృద్ధికి అనేక కీలక ప్రాజెక్టులను తీసుకువచ్చామని తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టు, రింగ్ రోడ్, విమానాశ్రయం తదితర అంశాల్లో ముందడుగు పడిందని పేర్కొన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్, ఎస్టీపీల ఏర్పాటు, భూసేకరణ తదితర ప్రక్రియలను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. సంబంధిత అధికారులకు భూసేకరణపై ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో వరంగల్ ప్రాంతానికి వచ్చిన నిధులు, ప్రస్తుత ప్రభుత్వం తీసుకువచ్చిన నిధులను ప్రజలు పరిశీలించాలని ఎమ్మెల్యే సూచించారు. మీరు రూ.20 కోట్లు తీసుకువస్తే, మేము రూ.80 కోట్లు తీసుకువచ్చాం. ఎవరు ఎంత అభివృద్ధి చేశారో ప్రజలే నిర్ణయిస్తారు అని అన్నారు. ఉద్యోగులకు సంబంధించిన కొన్ని సమస్యలు ఇంకా పరిష్కరించాల్సి ఉందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి వాటిని తీసుకెళ్లామని, ఉద్యోగులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే తెలిపారు. వరంగల్ ప్రాంతానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే అన్నారు. వరంగల్‌కు మరింత విస్తృతమైన పరిపాలనా, అభివృద్ధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటే ఈ ప్రాంతం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

గత రెండున్నరేళ్లలోనే ఇంత అభివృద్ధి సాధించాం. భవిష్యత్తులో మరింత బలమైన పరిపాలనా వ్యవస్థ, కార్పొరేషన్ వంటి అవకాశాలు అందుబాటులోకి వస్తే వరంగల్‌ను ఏ స్థాయిలో అభివృద్ధి చేయవచ్చో ప్రజలు ఆలోచించాలి అని అన్నారు. స్విమ్మింగ్ పూల్ ప్రారంభించిన అనంతరం స్పోర్ట్స్, స్విమ్మింగ్ అకాడమీ క్రీడాకారులు స్విమ్మింగ్ చేస్తుండగా ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు పరిశీలించారు. బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్, ఏసీపీ జితేందర్ రెడ్డి, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి బ్యాడ్మింటన్ ఆడారు. ఈ సందర్భంగా బ్యాడ్మింటన్ వెటరన్ క్రీడాకారులు రమణయ్య, కైలాసంలను ఎమ్మెల్యే, కలెక్టర్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జూడో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కైలాస్ యాదవ్, ఆఫీసర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్, ఏసీపీ జితేందర్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ హనుమకొండ ప్రధాన కార్యదర్శి రమేష్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుపై చెలగాటం

- ఫీజుల బకాయిల విడుదలకు బీజేపీ పోరాటం





**అక్షరశక్తి,వరంగల్:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు పిలుపు మేరకు బీజేవైఎం వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో వరంగల్ చౌరస్తాలో శనివారం నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిల కారణంగా దాదాపు 40 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతున్న వివాదాస్పద జీవో 97ను వెంటనే రద్దు చేయాలని గంట రవికుమార్ డిమాండ్ చేశారు. మరోవైపు ఆయుష్ విద్యార్థులకు పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌తో పోలిస్తే తెలంగాణలో తక్కువ స్టైపెండ్ ఇస్తూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావును గృహ నిర్బంధం చేయడం, నిరసనలను పోలీసుల ద్వారా అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమేనని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యార్థుల సమస్యలపై తక్షణమే స్పందించాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడంతో పాటు జీవో 97ను రద్దు చేసి, ఆయుష్ విద్యార్థుల డిమాండ్లను నెరవేర్చాలని గంట రవికుమార్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి లోకంతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వంపై మరింత ఉధృతంగా పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎర్రగొల్ల భరత్ వీర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎలగందుల శ్రవణ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రత్నం సతీష్ షా, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బైరి నాగరాజు, మహిళా మోర్చా అధ్యక్షురాలు తెకుమట్ల రేణుకతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌పై సీఈసీకి సీఎం రేవంత్ లేఖ

- దాదాపు 92.86 లక్షల ఓట్ల తొలగింపుపై ఆందోళన
- దీనిపై సమగ్ర పరిశీలన అవసరం
- అదనపు సమయం ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి



**అక్షరశక్తి, హైదరాబాద్ :** తెలంగాణలో 2026 ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియ కారణంగా అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరు తొలగిపోకూడదని, అలాగే అనర్హులైన ఓటరు ఎవరూ జాబితాలో చేరకూడదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా భారత ఎన్నికల సంఘం (ECI) ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు ముఖ్యమంత్రి లేఖ రాశారు. అభ్యంతరాలు, ఫిర్యాదులు సమర్పించే గడువును పొడిగించడంతో పాటు ఓటర్లకు తగిన సమయం, అవసరమైన సహాయం అందించేలా విధానపరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కోరారు. 2026 జూన్ 10 నాటికి రాష్ట్రంలో 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వారిలో 73.39 లక్షల మందిని (21.7 శాతం) గైర్హాజరైన, నివాసం మారిన, మరణించిన, ఒకటికి మించి నమోదైన ఓటర్లుగా (ASDD) గుర్తించినట్లు ముఖ్యమంత్రి ECISVEEP గణాంకాలను ఉటంకించారు. ఈ వర్గంలో దాదాపు 62 శాతం మంది అంటే 45.19 లక్షల మందిని శాశ్వతంగా నివాసం మారిన వారిగా గుర్తించడం ఆందోళనకరమని పేర్కొన్నారు.

మరోవైపు డిజిటలైజ్ చేసిన 2.65 కోట్ల గణన పత్రాల్లో 60.50 లక్షల పత్రాల్లో లోపాలు ఉండగా, 32.36 లక్షల పత్రాలకు గత ఓటర్ల జాబితాతో అనుసంధానం చేయబడలేదని తెలిపారు. దీంతో సుమారు 92.86 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది రాష్ట్రంలోని దాదాపు మూడో వంతు ఓటర్లను ప్రభావితం చేసే అంశమని ఎన్నికల సంఘానికి వివరించారు. ప్రస్తుత సవరణ విధానంలో కొన్ని కీలకమైన లోపాలు ఉన్నాయని ముఖ్యమంత్రి లేఖలో పేర్కొన్నారు. గణన సిబ్బంది పరిశీలనకు వచ్చిన సమయంలో తాత్కాలికంగా ఇళ్లలో లేని వారిని, శాశ్వతంగా నివాసం మారిన వారిని ఒకే విధంగా పరిగణిస్తున్నారని తెలిపారు.

నిజంగా నివాసం మారిన వారికి కొత్త ప్రాంతంలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారం 6 ద్వారా ఎలాంటి సహాయం అందించకుండానే పాత నివాసంలోని ఓటు తొలగిస్తున్నారని పేర్కొన్నారు. అంతే కాకుండా నివాసం మారిన వారి పేర్లను తొలగించే ముందు అధికారిక నోటీసు ప్రక్రియను పాటించడం లేదని తెలిపారు. దీనివల్ల ఓటర్లు పోలింగ్ రోజున కేంద్రానికి వెళ్లే వరకు తమ ఓటు హక్కు తొలగిపోయిన విషయం తెలుసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని, ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు.

హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే రాష్ట్రంలోని మొత్తం గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన, ఒకటికి మించి నమోదైన ఓటర్లలో 58.6 శాతం, పరిశీలన నోటీసుల్లో 41.9 శాతం కేంద్రీకృతమై ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఉద్యోగాలు, వివాహాలు, తాత్కాలిక నివాస మార్పుల కారణంగా పట్టణ ప్రాంతాల్లో అనేక మంది ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున సవరణ ప్రక్రియను మరింత సులభతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమీప భవిష్యత్తులో తెలంగాణలో ఎలాంటి ఎన్నికలు లేవని, అందువల్ల ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సమగ్రంగా నిర్వహించేందుకు తగిన సమయం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఉన్న అభ్యంతరాలు, ఫిర్యాదుల గడువును మరో నాలుగు వారాలు పొడిగించి, నిర్ణయించిన తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ అక్టోబర్ 19 నుంచి సవరించాలని కోరారు.

గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ముందుగానే విస్తృత ప్రచారం నిర్వహించి, కనీసం రెండుసార్లు గ్రామ సభలు, వార్డు కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి ముసాయిదా ఓటర్ల జాబితాలను బహిరంగంగా చదివి వినిపించాలని విజ్ఞప్తి చేశారు.

నోటీసులు అందుకున్న రోజువారీ కూలీలు, వలస కార్మికులు, వయోవృద్ధులు తమ పత్రాలను సమర్పించేందుకు వారం రోజుల సమయం సరిపోదని, కనీసం మూడు నుంచి నాలుగు వారాల సమయం ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో నియోజకవర్గ, పోలింగ్ కేంద్ర స్థాయిలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి, ఓటర్లకు అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించడంతో పాటు వాటిని పొందేందుకు సహకరించాలని సూచించారు.

ప్రభుత్వ ఉత్తర్వు (జీవో నంబర్ 172) ప్రకారం జారీ చేసే కుటుంబ నమోదు ధ్రువపత్రాన్ని అంగీకరించకపోవడం వల్ల పట్టణ ప్రాంత ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ముఖ్యమంత్రి గారు తెలిపారు. మండల స్థాయిలో సులభంగా లభించే ఇతర పత్రాలను కూడా అంగీకరించేలా ఆధారాల జాబితాను సవరించి విస్తరించాలని సూచించారు.

హైదరాబాద్‌లోని ప్రతి నియోజకవర్గంలో సగటున 78 వేలకుపైగా కేసులు ఉన్నందున కేవలం కొంతమంది అధికారుల నియామకం సరిపోదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఓటర్ల నమోదు అధికారి స్థాయికి దిగువన అదనపు అధికారులను నియమించి, ముద్రిత నోటీసుల్లోనే నిర్దిష్ట తేదీలు, సమయాలను పేర్కొంటూ వికేంద్రీకృత విచారణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అర్హత ఉన్న ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సహాయ కేంద్రాల ఏర్పాటు, గ్రామసభల నిర్వహణతో పాటు పరిపాలనా, ఇతర అవసరమైన సహకారాన్ని పూర్తి స్థాయిలో అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ లేఖలో స్పష్టం చేశారు.

# నీట్ (పీజీ) పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలు

**పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐ.పి. ఎస్**




**అక్షరశక్తి, హనుమకొండ క్రైమ్:** ఆగస్టు 30 వ తేదిన వరంగల్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించే నీట్ (పీజీ) 2026 పరీక్షల సందర్భంగా అయా పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు సెక్షన్ 163 BNSS యాక్ట్ 2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో వుంటుందని పోలీస్ కమిషనర్ శ్వేత ఐపిఎస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాలకు 500 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా వుండరాదని సూచించారు. అదేవిధంగా ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఉరేగింపులు, దర్నలు, ప్రచారాలు నిర్వహించరాదని పెర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు ముసివేయాలని సూచించారు. పరిక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు తో పాటు ట్రాఫిక్ ఆంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పకడ్బంది చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.



# కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రజల్లోకి...

**సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు వినూత్న కార్యక్రమాలు**

అక్షరశక్తి,జనగామ: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా ఆ పార్టీ ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టేందుకు సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వినూత్న కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. దేవరుప్పుల మండలం తిరుమల గార్డెన్స్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న ఆయన పార్టీ శ్రేణులకు పలు సూచనలు, దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీ లను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిందని, 1000 రోజులు పూర్తయినా ఒక్క హామీని కూడా సంపూర్ణంగా నెరవేర్చలేదని ఆరోపించారు. ప్రతి వర్గానికి కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, వాటి అమలులో జరిగిన వైఫల్యాలను ప్రజలకు వివరించాలని దయాకర్‌రావు సూచించారు. రైతులు, రైతు కూలీలు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, యువత, దళితులు, బీసీలు, గిరిజనులు, ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులను ప్రత్యేకంగా కలిసి వారి సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఆయా వర్గాలకు రావాల్సిన ప్రయోజనాలు, బకాయిలను 'బాకీ కార్డుల' రూపంలో ప్రజలకు గుర్తు చేయాలని సూచించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడం, రైతులు సహా వివిధ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.

కేవలం హామీల అమలులో వైఫల్యాలకే పరిమితం కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో చేసిన పరిపాలనా వైఫల్యాలు, అవినీతి, అరాచకాలను ప్రజల ముందుంచాలని దయాకర్‌రావు పిలుపునిచ్చారు. మండల, గ్రామ, వార్డు స్థాయిలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగించుకుని వినూత్న ప్రచార కార్యక్రమాల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను కొత్త తరానికి చేరవేయాలని సూచించారు.

# బీజేవైఎం ధర్నాకు వేణుగోపాల్ గౌడ్ మద్దతు



**అక్షరశక్తి,హన్మకొండ:** ఏకాశిల పార్క్ వద్ద బీజేవైఎం హన్మకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఫీజుల బకాయి-బీజేపీ లడాయి' ధర్నాకు బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వద్దకొండ వేణుగోపాల్ గౌడ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. అధికారంలోకి వస్తే పాత బకాయిలను చెల్లించి, ఫీజులను క్రమం తప్పకుండా చెల్లిస్తామని హామీ ఇచ్చిన ప్రస్తుత ప్రభుత్వం రెండున్నరేళ్లు దాటినా బకాయిలను విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో గత నాలుగేళ్లకు సంబంధించిన సుమారు రూ.11 వేల కోట్ల ఫీజు బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో సుమారు 60 లక్షల మంది పేద విద్యార్థులు, ప్రైవేట్ కళాశాలలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వేణుగోపాల్ గౌడ్ అన్నారు. ప్రభుత్వం తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులు, యువత తీవ్ర ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఫీజులు, స్కాలర్‌షిప్ బకాయిలతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, యువత సమష్టిగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

# ప్రణాళికాబద్ధమైన బోధనతో ఉత్తమ ఫలితాలు...

**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**



**అక్షరశక్తి,ములుగు:** ప్రణాళికాబద్ధమైన బోధనతో విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సూచించారు. శనివారం ములుగు జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాలలోని నిఘా కెమెరాల పనితీరు, విద్యార్థినులు, ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్న అనంతరం తరగతి గదులను సందర్శించి బోధన తీరును పరిశీలించారు. జూనియర్ కళాశాల విద్యార్థినులకు నిర్వహిస్తున్న యూనిట్ పరీక్షల తీరును పరిశీలించి, పరీక్షల నిర్వహణపై సంబంధిత ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థినులకు నిర్ణీత ఆహార పట్టిక ప్రకారం నాణ్యమైన, పౌష్టికమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. శనివారం ఆహార పట్టిక ప్రకారం అందించాల్సిన భోజన పదార్థాల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. భోజనం తయారీలో నాణ్యత, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. విద్యార్థినులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, విద్యాభ్యాసం, ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ స్వాతి, రికార్డు అసిస్టెంట్ రాజు, సంబంధిత అధికారులు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

# పింగళి కళాశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

**అక్షరశక్తి, హనుమకొండ:** తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని వడ్డేపల్లి పింగళి మహిళా కళాశాలలో శనివారం తెలుగు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ హాజరై తెలుగు భాష గొప్పతనం, ప్రాశస్త్యం, సాహిత్య వైభవాన్ని వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చంద్రమౌళి మాట్లాడుతూ తెలుగు భాషను పరిరక్షించడంతో పాటు భావి తరాలకు దాని వైభవాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులు తెలుగు భాషపై మక్కువ పెంచుకుని, పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకోవాలని సూచించారు. "ఐ లవ్ రీడింగ్ - ఐ లైక్ లైబ్రరీ" కార్యక్రమంలో భాగంగా నిమ్మల శ్రీనివాస్ తెలుగు శాఖకు విలువైన తెలుగు సాహిత్య పుస్తకాలను అందజేశారు. విద్యార్థులు తెలుగు భాషపై వినిపించిన కవితలు, ప్రసంగాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. తెలుగు శాఖాధిపతి మధు కార్యక్రమాన్ని సమన్వయం చేసి నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు శాఖ సిబ్బంది డాక్టర్ రామారత్నమాల, లక్ష్మీకాంతం, ప్రొఫెసర్ యుగంధర్, మమత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిమ్మల శ్రీనివాస్‌ను కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు.



# సీజనల్ వ్యాధులను తేలిగ్గా తీసుకోవద్దు

- కేసులు పెరుగుతున్న జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- అవసరమైన పరీక్షలు, చికిత్స అందించాలి
- ప్రతి శుక్రవారం 'డ్రై డే' అమలు చేయాలి
- మంత్రి దామోదర రాజనర్సింహ
- ఆరోగ్య శాఖ అధికారులతో సమావేశం



**అక్షరశక్తి, హైదరాబాద్ :** సీజనల్ వ్యాధులపై మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. శనివారం నాడు రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలో సీజన్ వ్యాధుల పరిస్థితిపై ఆరోగ్య శాఖ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డెంగ్యూ, మలేరియా, చికన్‌గున్యా కేసులు తగ్గుముఖం పట్టాయన్నారు. గతేడాదితో పోలిస్తే డయేరియా, డిసెంట్రీ కేసులు కూడా తక్కువగా నమోదు అయినట్లు తెలిపారు. టైఫాయిడ్ కేసులు స్వల్పంగా పెరిగాయన్నారు. కేసులు పెరుగుతున్న జిల్లాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. ఫీవర్ సర్వేలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి జ్వరం కేసును పర్యవేక్షించి.. అవసరమైన పరీక్షలు, చికిత్స అందించాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో మందులు, టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఐఎల్ఐ, స్వైన్‌ఫ్లూ కేసులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఐఎల్ఐ కేసులపై రోజువారీగా పర్యవేక్షించాలని రాజనర్సింహ తెలిపారు. అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో సీజనల్ ఇన్‌ఫ్లూయెంజా పూర్తిగా నియంత్రణలోనే ఉందని మంత్రికి అధికారులు వివరించారు. దోమల నివారణ చర్యలను మరింత ముమ్మరం చేయాలని దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు. ప్రతి శుక్రవారం 'డ్రై డే' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. నిల్వ నీటి తొలగింపు, లార్వా నిర్మూలన, ఫాగింగ్ కొనసాగించాలని సూచించారు. గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స కంటే.. ముందస్తు నివారణే లక్ష్యమన్నారు. ప్రతి జిల్లాలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల కేసులను ఏమాత్రం తేలికగా తీసుకోవద్దని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు.

# సోషల్ టీచర్ల సేవలు అభినందనీయం

- ఖిలా వరంగల్ మండల విద్యాధికారి వెంకటయ్య
- ఘనంగా సోషల్ టీచర్లకు సన్మానం



**అక్షరశక్తి, వరంగల్ :** బడుల నిర్వహణలో.. విద్యార్థుల జీవన నైపుణ్యాల పెంపులో..సోషల్ టీచర్ల సేవలు అభినందనీయమని ఖిలా వరంగల్ మండల్ విద్యాశాఖ అధికారి వెంకటయ్య కొనియాడారు. వరంగల్ నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన సోషల్ కాంప్లెక్స్ మీటింగ్ ను ఆయన సందర్శించి శిక్షణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంప్లెక్స్ సమావేశంలో పొందిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులను సర్వతోముఖాభివృద్ధి సాధించేలా కృషి చేయడంలో సోషల్ టీచర్ల పాత్ర కీలకమన్నారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పూసారం, సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, ఉర్సు కాంప్లెక్స్ సోషల్ ఫోరం అధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి, సెక్రటరీ ఎం. బిక్షపతి, కోశాధికారి రంగాచారి, ఉపాధ్యక్షులు చంద్రకళ, శోభారాణి ఆధ్వర్యంలో ఎంఈఓను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఉర్సు కాంప్లెక్స్ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో.. ఈ నెలలో ఉద్యోగ విరమణ పొందుతున్న వి వెంకటరెడ్డి, ఎం శారద, ఇటీవల ఏపీఎస్సీ ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించిన భూపాల్ రెడ్డి, గులాబ్ సింగ్ లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఎస్ఎస్సి ఉత్తీర్ణత శాతంలో రెండవ స్థానాన్ని సాధించిన ప్రభుత్వ పాఠశాల కృష్ణ కాలనీకి చెందిన సోషల్ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులైన సదాలక్ష్మి రాజేష్ లను ఎంఈఓ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్పిలు సిహెచ్. సంపత్, జే. సంపత్, రిటైర్డ్ ఉపాధ్యాయులు మహేందర్ రెడ్డి, సమ్మయ్య, వరంగల్, ఖిలా వరంగల్ లోని సోషల్ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రొజెక్టర్ బహూకరించిన టీచర్ డాక్టర్ వి గోపీనాథ్



**అక్షరశక్తి, గూడూరు:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని ఎం.పి.పి.ఎస్ పాటిమీదిగూడెం పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ గా పని చేస్తున్న ఒక్కరూ మారిన చాలు ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ వి.గోపీనాథ్ ఆ పాఠశాలకు ప్రొజెక్టర్ ను బహూకరించారు. డిజిటల్ విద్యలో భాగంగా విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో తన సొంత ఖర్చులతో ప్రొజెక్టర్ ను హెచ్ఎం సుమలత కి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు సాగాలని,దృశ్య శ్రవణ పద్ధతి ద్వారా పాఠాలు సులభంగా అర్థమవుతాయని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుమలత అంగన్వాడి టీచర్ పద్మ, తల్లితండ్రులు, విద్యార్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

# కేయూ క్యాంపస్ కళాశాలలో ఎంసిఏ స్పాట్ అడ్మిషన్లు

**అక్షరశక్తి, కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కళాశాలలో 2026–2027 విద్యా సంవత్సరానికి గాను ఎంసిఏ కోర్సులో ఈ నెల 31 నుండి సెప్టెంబర్ 3 వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టి జి ఐ సెట్ 2026లో అర్హత సాధించిన అభ్యర్థులతో పాటు, అర్హత సాధించని అభ్యర్థులు కూడా స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావచ్చని ఆయన తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు, అవసరమైన ఫీజును వెంట తీసుకురావాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్ ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులు కాదని తెలిపారు. స్పాట్ అడ్మిషన్లకు సంబంధించిన మార్గదర్శకాలు టి జి ఐ సెట్ అధికారిక వెబ్‌సైట్ ను సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు కాకతీయ యూనివర్సిటీలోని క్యాంపస్ కళాశాలలో సంప్రదించాలన్నారు.

# ఫీజు బకాయిలతో విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం

- రాష్ట్రంలో 40 లక్షల మంది విద్యార్థుల పరిస్థితి ప్రశ్నార్థకం
- రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి
- లేకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తాం
- బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మారెడ్డి



**అక్షరశక్తి, హనుమకొండ:** కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకుండా పేద విద్యార్థుల భవిష్యత్తుతో రాక్షస క్రీడ ఆడుతోందని బీజేపీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కాండిడేట్, పార్టీ మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రభుత్వ అసమర్థత కారణంగా ప్రశ్నార్థకంగా మారిందని విమర్శించారు. తక్షణమే రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

హనుమకొండ ఏకశిలా పార్క్ వద్ద బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఫీజు బకాయి-బీజేపీ లడాయి' నిరసన దీక్షను శనివారం రావు పద్మారెడ్డి ప్రారంభించి సంపూర్ణ మద్దతు తెలిపారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రావు పద్మారెడ్డి మాట్లాడుతూ.. రోజువారీ కూలీలు, ఆటోడ్రైవర్లు, ఇతర పేద కుటుంబాల పిల్లలు ఉన్నత చదువులు చదువుకోవాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం దాదాపు రూ.15 వేల కోట్ల బకాయిలను చెల్లించకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని, ఫలితంగా ఉద్యోగ అవకాశాలు వచ్చినా వాటిని అందుకోలేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాల బకాయిలతో తమకు సంబంధం లేదని ముఖ్యమంత్రి చెప్పడం అజ్ఞానానికి, బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. ఢిల్లీ వేదికగా జెన్‌జెడ్, విద్యార్థుల భవిష్యత్తు గురించి మాట్లాడే రాహుల్‌గాంధీ.. తెలంగాణలో కాంగ్రెస్ పాలనలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, విద్యాసంస్థలకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ఆమె స్పష్టం చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల తరఫున బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలు




**అక్షరశక్తి,హనుమకొండ:** ప్రభుత్వ వృత్తి విద్య జూనియర్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. శ్రీధర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత క్రీడా రంగానికి ధ్యాన్‌చంద్ అందించిన సేవలు చిరస్మరణీయమని, అసాధారణ హాకీ ప్రతిభతో అంతర్జాతీయ స్థాయిలో దేశానికి గుర్తింపు తీసుకువచ్చారని కొనియాడారు. విద్యార్థులు ఆయనను స్ఫూర్తిగా తీసుకొని క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల క్రీడల ఇన్‌చార్జ్ మదూరి సమ్మయ్య గౌడ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. క్రీడా విభాగంలో కళాశాల పేరును రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిలబెట్టేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ప్రిన్సిపాల్ సూచించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ ఆర్. ప్రవీణ్ కుమార్, డాక్టర్ సవ్వాసి శ్రీనివాస్‌తో పాటు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్ట్స కళాశాల లో ఎంబీఏ, ఎంసీఏ ప్రత్యేక ప్రవేశాలు

**మహిళా పీజీ కళాశాలలోనూ ఖాళీ సీట్ల భర్తీ**



**అక్షరశక్తి,హనుమకొండ:** సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ప్రత్యేక ప్రవేశాలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి తెలిపారు. ఎంసీఏలో 12, ఎంబీఏలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 3 వరకు ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు తమ అసలు విద్యార్హత ధ్రువపత్రాలతో కళాశాలకు హాజరై ప్రవేశం పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా కాకతీయ విశ్వవిద్యాలయం మహిళా పీజీ కళాశాలలో ఎంబీఏలో 40 సీట్లు, ఎంసీఏలో 53 సీట్లు ఖాళీగా ఉన్నాయని మహిళా పీజీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థినులు అసలు ధ్రువపత్రాలతో హాజరై ప్రవేశం పొందవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## తెలంగాణలో టెట్ ఎగ్జామ్..

**ఇన్ సర్వీస్ టీచర్ల కోసం స్పెషల్ టెట్**

**అక్షరశక్తి, హైదరాబాద్ :** తెలంగాణలో ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల బోధనా అర్హత కోసం నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. 2026 విద్యా సంవత్సరానికిగాను సెప్టెంబర్ 8, 9 తేదీల్లో ఈ పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక టెట్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 24,983 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్షలను ప్రతిరోజూ మూడు షిఫ్టుల్లో నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఉదయం 9:00 గంటల నుంచి 11:30 వరకు, మధ్యాహ్నం 2:00 గంటల నుంచి 4:30 వరకు వివిధ సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. సెప్టెంబర్ 8న పేపర్1, పేపర్2 (తెలుగు, ఇంగ్లీష్ మీడియం) పరీక్షలు నిర్వహిస్తారు. సెప్టెంబర్ 9న మిగిలిన మాధ్యమాలకు సంబంధించిన పేపర్2 పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ, సంబంధిత పాఠశాలల్లో పనిచేస్తూ.. ఇప్పటికీ నిర్దేశిత అర్హత ప్రమాణాలను సాధించని ఉపాధ్యాయుల కోసమే ఈ ప్రత్యేక టెట్‌ను నిర్వహిస్తున్నారు. హాల్ టికెట్లు, ఇతర పూర్తి వివరాల కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ schooledu.telangana.gov.in సందర్శించాలని విద్యాశాఖ సూచించింది.

## ప్రీతమ్‌కు మాతృవియోగం



**అక్షరశక్తి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, ఏఐసిసి ఎస్సీ సెల్ జాతీయ కోఆర్డినేటర్ నాగరిగారి ప్రీతమ్ తల్లి నాగరిగారి వసంత రాణి నిన్నటి రోజు రాత్రి అకాల మరణం చెందగా, ఈరోజు ఉదయం హైదరాబాద్లోని చెంగిచెర్ల వారి స్వగృహంలో అమె పార్థివదేహానికి పలువురు నాయకులు పూలమాలలువేసి, నివాళులర్పించారు. టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ పక్షాన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపీసీసి ఎస్సి సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆరెపల్లి రాజేందర్, వైస్ చైర్మన్ డాక్టర్. మడికొండ శ్రీను, రాసమల్ల జగన్, అందే గంగాజమున, ప్రధాన కార్యదర్శి, దళిత రత్న దబ్బేట రమేష్, కార్యదర్శి నత్తి కొర్నేలు, మేడ్చల్ జిల్లా చైర్మన్ కావలి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలి

- కార్యకర్తలకు బీఆర్ఎస్ నాయకుడు బండి రజినీకుమార్ పిలుపు



**అక్షరశక్తి, హసన్‌పర్తి:** కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన వైఫల్యాలపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఇచ్చిన పోరుబాటను పార్టీ శ్రేణులు విజయవంతంగా చేయాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ హసన్‌పర్తి మండల అధ్యక్షుడు బండి రజినీ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు హసన్‌పర్తి మండల కేంద్రంలో ముఖ్యనాయకుల సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు డాక్టర్ బండి రజనీకుమార్ మాట్లాడుతూ... కేటీఆర్ ఇచ్చిన నిరసన కార్యక్రమంలో భాగంగా వర్ధన్నపేట నియోజకవర్గం హసన్ పర్తి మండలంలోని అన్ని గ్రామాల బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు ఈనెల 2 తేది నుండి 8 తేది వరకు వరకు జరిగే నిరసన కార్యక్రమాలలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలపై నిలదీయాలని అన్నారు. హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగట్టి, వారి మోసాలను ప్రజల మధ్యకు తీసుకెళ్లి ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి బిఆర్ఎస్ కార్యకర్త మీద ఉందని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ 66 డివిజన్ పార్టీ అధ్యక్షులు పావుశెట్టి శ్రీధర్, 53 డివిజన్ ఇంచార్జ్ బోడ యుగంధర్, గిన్నారపు రవీందర్, ఇమ్మడి రాజేందర్, కేదాసి రాకేష్, దోనపాటి చంద్రకర్ రెడ్డి, దాసరి మారి, చాతల్ల వేణు, మట్టెడ ప్రమోద్, తాళ్ల మహేందర్, ఇంకా తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



**అక్షరశక్తి,హనుమకొండ:** పద్మాక్షి రోడ్డులోని హనుమద్గిరి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శ్రావణమాస శనివారం సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకం, అర్చన, ఆకుపూజను వేదపండితులు ఆరుట్ల రామాచార్యులు ఘనంగా నిర్వహించారు. అనంతరం భజన కార్యక్రమం నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. అన్నప్రసాద దాతలుగా శ్రీమతి కోరుకంటి తేజస్విని లావిన్ రావు, వారి పిల్లలు అనుద్య, ఆరాధ్య (అమెరికా) వ్యవహరించారు. కార్యక్రమంలో అన్నదాన కమిటీ అధ్యక్షులు గందె కృష్ణ, కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్, నన్నేబోయిన కొమురయ్య, గంధ్రతి సుధాకర్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.

GUEST COLUMN

# ప్రజాస్వామ్యానికి అసలు పరీక్ష: అధికారపు అహంకారమా? ప్రజల వివేకమా!

ప్రజాస్వామ్యంలో అవినీతి, దుర్వినియోగం, అధికార కేంద్రీకరణ వంటి సమస్యలకు బాధ్యత కేవలం పాలకులదే కాదు; వాటిని సహించే, కొన్నిసార్లు తాత్కాలిక ప్రయోజనం కోసం ప్రోత్సహించే సమాజానిది కూడా కొంత బాధ్యత ఉంటుంది. రెండు వేలకో, మూడు వేలకో ఓటు అమ్ముకోవడం ద్వారా ఒక కుటుంబ భవిష్యత్తు మారదు. కానీ అలాంటి ఓటు ద్వారా ఐదేళ్ల పాలనను అప్పగిస్తే, ఆ చిన్న మొత్తానికి సమాజం తన రాజకీయ భవిష్యత్తునే తాకట్టు పెడుతుంది. అయితే ఇక్కడే ఒక కీలకమైన ప్రశ్న ఉంది. ఇక్కడ కేవలం పేద ఓటరును మాత్రమే నిందించడం న్యాయమా? ఎన్నికల సమయంలో డబ్బు పంచే రాజకీయ పార్టీలకు, కోట్లాది రూపాయల ఎన్నికల నిధులు సమీకరించే కార్పొరేట్ వ్యవస్థలకు, అధికారాన్ని ఉపయోగించి విధానాలను ప్రభావితం చేసే శక్తివంతమైన వర్గాలకు సమానమైన నైతిక ప్రమాణం ఎందుకు వర్తించకూడదు?

అవినీతి అనేది కేవలం ఒక ఉద్యోగి లంచం తీసుకోవడమే కాదు. అది అధికారాన్ని వ్యక్తిగత లేదా రాజకీయ ప్రయోజనానికి ఉపయోగించే పెద్ద వ్యవస్థ. ఒక పేద రైతు నుంచి రెండు వేల రూపాయలు లంచంగా తీసుకునే అధికారి ఎంత తప్పు చేస్తున్నాడో, ప్రజా విధానాలను ప్రభావితం చేసే రాజకీయ విరాళాల వ్యవస్థలో పారదర్శకత లేకపోవడం కూడా అంతే తీవ్రమైన ప్రజాస్వామ్య సమస్య. అందుకే గత పన్నెండేళ్ల బీజేపీ పాలనను పరిశీలించేటప్పుడు చిన్నస్థాయి అవినీతితో పాటు రాజకీయ నిధులు, సంస్థల స్వతంత్రత, మీడియా స్వేచ్ఛ, దర్యాప్తు సంస్థల దుర్వినియోగం , ఎన్నికల పారదర్శకత, పార్లమెంటరీ జవాబుదారీతనం వంటి అంశాలను కూడా ప్రశ్నించాలి.

ఈ విషయంలో ఎన్నికల బాండ్ల వ్యవస్థ ఒక కీలక ఉదాహరణ. రాజకీయ పార్టీలకు పెద్ద మొత్తంలో విరాళాలు ఎవరు ఇచ్చారో ప్రజలకు తెలియకుండా చేసే విధానం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు 2024 ఫిబ్రవరిలో తేల్చి చెప్పింది. కార్పొరేట్ సంస్థల రాజకీయ విరాళాలపై ఉన్న పరిమితులను తొలగించడం కూడా ఏకపక్షంగా, రాజ్యాంగ విరుద్ధంగా ఉందని కోర్టు పేర్కొంది. ఇది సాధారణ అవినీతి ఆరోపణ కాదు. ప్రజాస్వామ్యంలో డబ్బు అలాగే అధికార సంబంధం ఎంత పారదర్శకంగా ఉండాలి అనేదే ప్రాథమిక ప్రశ్న.

మన భారత దేశ పరిస్థితిని అంతర్జాతీయ సూచీలతో (ఇండెక్స్ లతో) పరిశీలించి చూసినప్పుడు మనకు అనేక ఆందోళనకర అంశాలు కనిపిస్తాయి. ముఖ్యంగా మన దేశంలో వైద్య, ఆరోగ్య సదుపాయాల లభ్యతలో భారత్ 193వ స్థానంలో నిలిచింది, పర్యావరణ పనితీరులో 176వ స్థానంలో ఉంది, పత్రికా స్వేచ్ఛలో 151వ స్థానంలో అధ్వాన్నంగా ఉంది, మానవాభివృద్ధిలో 130వ స్థానంలో కొనసాగుతోంది, తాగునీటి నాణ్యతలో 120వ స్థానంలో, ప్రపంచ ఆకలి సూచీలో 102వ స్థానంలో, అవినీతి ర్యాంకింగ్‌లో 91వ స్థానంలో ఉందని ఈ అంతర్జాతీయ ఇండెక్స్ లు స్పష్టంగా తెలుపుతున్నాయి. అయితే ఈ సంఖ్యలన్నీ ఒకే సంవత్సరం లేదా ఒకే సంస్థకు చెందినవి మాత్రమే కావు. కాబట్టి , వాటిని ఒకే కాలానికి చెందిన సమగ్ర "రిపోర్ట్ కార్డు"గా చూడటం



శాస్త్రీయంగా సరైంది కాదు. ఉదాహరణకు 2025 మానవాభివృద్ధి నివేదికలో భారత్ 193 దేశాల్లో 130వ స్థానంలో ఉంది; అదే సమయంలో మానవాభివృద్ధి సూచీ విలువ 0.685కు పెరిగింది. అంటే పరిస్థితి పూర్తిగా కుప్పకూలిందని చెప్పడం కూడా తప్పే.

అయితే పురోగతి ఉన్న చోట దానిని అంగీకరిస్తూనే, వైఫల్యాలను కప్పిపుచ్చాల్సిన అవసరం లేదు. 2025 ప్రపంచ ఆకలి సూచీలో భారత్ 123 దేశాల్లో 102వ స్థానంలో ఉంది. ఈ స్కోరు 25.8గా ఉండి "తీవ్రమైన" ఆకలి పరిస్థితి కేటగిరీలోనే ఉంది. పిల్లల్లో ఎదుగుదల లోపం 32.9 శాతం, పిల్లల పోషకాహార లోపం 18.7 శాతంగా ఉండటం తీవ్రమైన ప్రజారోగ్య హెచ్చరిక.

పర్యావరణ పరిస్థితి కూడా రాజకీయ ప్రసంగాల్లో చెప్పే అభివృద్ధి కథకు మరో ముఖాన్ని చూపిస్తోంది. "యేల్ విశ్వవిద్యాలయ 2024 పర్యావరణ పనితీరు సూచీలో" భారత్ 180 దేశాల్లో 176వ స్థానంలో, స్కోరు 27.6తో ఉంది. జీవవైవిధ్యం, ఆవాసాల పరిరక్షణ వంటి అంశాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. అభివృద్ధి పేరుతో పర్యావరణ నియంత్రణలను బలహీనపరిస్తే, దాని మూల్యం భవిష్యత్ తరాలే చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటి నేపాల్ జల ప్రళయం ఒక ఉదాహరణ.

పత్రికా స్వేచ్ఛ విషయంలో కూడా భారత్ 2025 లో 151వ స్థానంలో ఉందని అంతర్జాతీయ సూచీ చూపిస్తుంది. అయితే 2026లో 'రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్' భారత్‌ను 180 దేశాల్లో 157వ స్థానంలో ఉంచింది. మీడియా యాజమాన్య కేంద్రీకరణ (గోదీ మీడియా), రాజకీయ అనుబంధాలు, జర్నలిస్టులపై, సంపాదకులపై ఒత్తిళ్లు, హింస వంటి అంశాలపై ఆ సంస్థ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్యంలో మీడియా బలహీనపడితే ప్రభుత్వం తప్పులను ప్రశ్నించే ఒక ప్రధాన సంస్థ బలహీనపడినట్టే కదా!.

గత పన్నెండేళ్లలో కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి అత్యంత తీవ్రమైన విమర్శలలో ఒకటి అధికార కేంద్రీకరణ. పార్లమెంటరీ చర్చలకు బదులు ఆర్డినెన్సులు, వేగవంతమైన చట్టనిర్మాణం, దర్యాప్తు సంస్థల రాజకీయ వినియోగంపై వచ్చిన ఆరోపణలు, రాష్ట్రాల ఆర్థిక స్వయం ప్రతిపత్తిపై వివాదాలు... ఇవన్నీ కలిపి కేంద్రరాష్ట్ర సంబంధాలపై అనేక ప్రశ్నలు లేవనెత్తాయి. బలమైన కేంద్రం అవసరం కావచ్చు; కానీ బలమైన కేంద్రం అంటే బలహీనమైన రాష్ట్రాలు, బలహీనమైన పార్లమెంట్, భయపడే మీడియా, మౌనంగా ఉండే సంస్థలు అనే అర్థం మాత్రం కాదు.

ఆర్థిక రంగంలో కూడా మోదీ ప్రభుత్వ నిర్ణయాలు తీవ్ర చర్చకు గురయ్యాయి. 2016 నోట్ల రద్దు సమయంలో చలామణిలో ఉన్న కరెన్సీలో 86 శాతం విలువైన నోట్లు రద్దయ్యాయి. నగదు ఆధారిత చిన్న వ్యాపారాలు, అసంఘటిత రంగం, వలస కార్మికులు తీవ్రంగా దెబ్బతిన్నారు. ఉగ్రవాదం, నల్లధనం, నకిలీ కరెన్సీ నిర్మూలన వంటి లక్ష్యాలతో తీసుకున్న నిర్ణయం చివరికి రద్దయిన నోట్లలో దాదాపు మొత్తం వ్యవస్థలోకి తిరిగి రావడంతో దాని ఫలితాలపై ప్రశ్నలు చాలా మిగిలి పోయాయి. ఇది విధాన నిర్ణయాల్లో ప్రచార శక్తి కంటే ముందస్తు ఆర్థిక విశ్లేషణ ఎంత ముఖ్యమో గుర్తుచేసింది.

అదే సమయంలో జీఎస్టీ ద్వారా పన్నుల వ్యవస్థను ఏకీకృతం చేయడం, డిజిటల్ చెల్లింపులను విస్తరించడం, మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు పెంచడం వంటి విజయాలను కూడా నిరాకరించలేం. ప్రపంచ బ్యాంకు తాజా అంచనాల ప్రకారం 201112 నుంచి 202324 మధ్య రోజుకు 4.20 డాలర్ల అంతర్జాతీయ దారిద్ర్య రేఖ కింద ఉన్న జనాభా వాటా 57.7 శాతం నుంచి 16.1 శాతానికి తగ్గింది. తీవ్ర పేదరికం 27.1 శాతం నుంచి 2.6 శాతానికి పడిపోయింది. కాబట్టి "పన్నెండేళ్లలో దేశం మొత్తం నాశనం అయిపోయింది" అనే రాజకీయ వాదన కూడా కొంత అతిశయోక్తితో కూడుకున్నదే. అయితే, "ప్రతి రంగంలో అద్భుత విజయం సాధించాం" అనే అధికార పార్టీ ప్రచారం కూడా అంతే అసంపూర్ణం.

అసలు సంక్షోభం ఉద్యోగాల విషయంలో స్పష్టంగా కనిపిస్తుంది. 'అంతర్జాతీయ కార్మిక సంస్థ', 'ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్' సంయుక్తంగా రూపొందించిన 2024 భారత ఉపాధి నివేదిక యువత ఉపాధి, విద్య, నైపుణ్యాల మధ్య ఉన్న తీవ్రమైన అసమతౌల్యాన్ని ఎత్తి చూపింది. విద్యావంతుడైన యువకుడికి డిగ్రీ ఉన్నా తగిన ఉద్యోగం లేకపోవడం, పోటీ పరీక్షల కోసం సంవత్సరాల తరబడి తిరగడం, పరీక్షలలో అక్రమాలు లేదా ప్రశ్న పత్రాల లీకేజీల ఆరోపణలు ఎదురవడం, ఇవి కేవలం విద్యాశాఖ సమస్యలు మాత్రమే కావు; దేశ భవిష్యత్తుపై పెట్టుబడి విఫలమవుతున్న సంకేతాలు.

అయితే ఇక్కడ "కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ పరీక్షా పేపర్లు లీక్ కావటానికి ", "22 మంది విద్యార్థుల మరణాలకు ఆయనే నైతిక బాధ్యత వహించి" తనంతట తానే రాజీనామా చేసి ఉంటే బాగుండేది. నీట్ యూజీ, ఇతర పోటీ పరీక్షల్లో అక్రమాలు, లీకేజీలు, నిర్వహణ వైఫల్యాలు తీవ్ర సమస్యలే అయినా, వ్యక్తిగత క్రిమినల్ బాధ్యతను నిర్ధారించేది దర్యాప్తు, న్యాయ ప్రక్రియ. ప్రజాస్వామ్య విమర్శ కూడా ఆధారాలపైనే నిలబడాలి.

ఇదే ప్రమాణం గత 12 ఏళ్ళలో ప్రధానమంత్రి, హోంమంత్రి లేదా ఇతర మంత్రులు తమ మంత్రిత్వ శాఖల వైఫల్యాలకు కూడా నైతిక బాధ్యత వహించాలి. రాజకీయ నాయకుల విధానాలను, నిర్ణయాలను, పరిపాలనా వైఫల్యాలను ఎంత ఘాటుగా విపక్షాలు విమర్శించినా, అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విమర్శలను ఏ మాత్రం పట్టించుకోలేదు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే ప్రతిపక్ష పార్టీల అభిప్రాయాలను గౌరవించాలి. అధికార పక్షం కూడా సత్యాన్నే ఆయుధంగా ఉపయోగించాలి.

ఇదే దిశలో "కాక్రోచ్ జనతా పార్టీ" పుట్టింది. దీనికి ప్రధాన కారణం యువతలో పెరుగుతున్న అసంతృప్తికి ప్రతీకగా చూడాలి. భారతీ యువతను "పరాన్నజీవులు", "సోమరులు" వంటి అవమానకర పదాలతో చూడటం ఏ అధికారి చేసినా తప్పే. కానీ వారి నిరసన కూడా రాజ్యాంగబద్ధమైన, శాంతియుతమైన మార్గంలోనే నడిచింది. ప్రభుత్వం ప్రజల నుంచి వచ్చే విమర్శను అణచివేయకూడదు. నిరసనకారులు శాంతి యుతంగా వారి ఆగ్రహాన్ని ,నిరసనను, బాధలను కేంద్ర ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. పోలీసులే విద్యార్థులపై, నిరుద్యోగులపై హింసకు పాల్పడటం సరైనది కాదు.

చివరికి అసలు ప్రశ్న బీజేపీ ఓడిపోవాలా, మరొక పార్టీ గెలవాలా అనేది మాత్రమే ముఖ్యం కాదు. భారత ప్రజాస్వామ్యం వ్యక్తుల పాలన నుంచి సంస్థల పాలనకు తిరిగి వస్తుందా? ఎన్నికల్లో డబ్బు ప్రభావం తగ్గుతుందా? మీడియా స్వేచ్ఛ బలపడుతుందా? దర్యాప్తు సంస్థలు రాజకీయ ఆదేశాలకు అతీతంగా పనిచేస్తాయా? పార్లమెంట్ నిజమైన చర్చా వేదికగా మారుతుందా? రాష్ట్రాలకు న్యాయమైన ఆర్థిక స్వయం ప్రతిపత్తి ఉంటుందా? విద్యార్థులకు నమ్మకమైన పరీక్షా వ్యవస్థ, యువతకు గౌరవప్రదమైన ఉద్యోగాలు లభిస్తాయా? పర్యావరణాన్ని అభివృద్ధికి శత్రువుగా కాకుండా అభివృద్ధి పునాదిగా చూస్తామా?

ఈ ప్రశ్నలకు సమాధానం కేవలం పాలకుల మార్పులో మాత్రమే లేదు. ఓటు అమ్ముకునే పౌరుడు, ప్రశ్నించడానికి భయపడే మేధావి, అధికారాన్ని పొగిడే మీడియా, ఒత్తిడికి లొంగే దర్యాప్తు సంస్థలు, ఇవన్నీ ప్రజాస్వామ్య బలహీనతలో భాగస్వాములే. అందువల్ల దేశానికి అవసరమైనది మరో "వ్యక్తి పూజ" కాదు; ప్రశ్నించే పౌరసమాజం, స్వతంత్ర సంస్థలు, బాధ్యతాయుతమైన ప్రతిపక్షం, స్వేచ్ఛాయుత మీడియా, నిజాయితీగల రాజకీయ నిధులు, నాణ్యమైన విద్య, ఉపాధి మరియు రాజ్యాంగ విలువల పునరుద్ధరణ.

ప్రజాస్వామ్యంలో నిజమైన స్వాతంత్ర్య పోరాటం ఒక పార్టీని గద్దె దించడం కాదు. "అధికారంలో ఉన్నవారిని ఎవరు అయినా ప్రశ్నించే హక్కును కాపాడటం, ఓటును అమ్మకుండా ఉండటం, అవినీతిని తిరస్కరించడం, అబద్ధాన్ని ప్రచారం చేయకపోవడం, సంస్థల స్వతంత్రతను రక్షించడం... అదే ఆధునిక భారతదేశానికి అవసరమైన అసలు స్వాతంత్ర్య పోరాటం."



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
ramkishore.1504@gmail.com

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.



# పోస్టర్లు అతికించా!

# ప్రజాప్రతినిధిగా ఎదిగా!!

## విద్యార్థి దశ నుంచి రాజకీయాలు

- న్యాయం కోసం కొట్లాటకు పోతే రౌడీ అన్నారు
- ఉద్యమాల ఓనమాలతో చదువు ఆగింది
- ఇంటర్ నుండి ఇంట్లో డబ్బులే అడగలేదు
- పావలా ఇడ్లీ తిన్న...వెయ్యి రూపాయల ఇడ్లీ తిన్న
- కాంగ్రెస్ పార్టీకి డ్రగ్ అడిక్ట్ లాగా అయ్యాను
- వేరే కండువా ఊహించను
- నా ఫ్యామిలీ కాంగ్రెస్ ఫ్యామిలీ
- ఇప్పుడు హ్యాపీ... ఇంకా ఏది వచ్చినా అది బోనస్



చదువులో ఎప్పుడూ వెనకే... కానీ స్నేహితుల కోసం అందరికంటే ముందు ఉండేవాడు. అన్యాయం జరిగితే చూస్తూ ఉండేవాడు మంచి వాడు ఐతే, కొట్లాడే వాడు రౌడీ అన్నా.. పద్దతి మార్చుకోలేదు. స్కూలింగ్, ఇంటర్ లోనే నాయకత్వ లక్షణాలు.. ఆపై ఆర్ట్స్ కళాశాల డిగ్రీ ఫస్ట్ ఇయర్ లోనే స్టూడెంట్ లీడర్ అయ్యాడు... ఇప్పుడు ఎమ్మెల్యే గా ఎదిగాడు నాయిని రాజేందర్ రెడ్డి. ఎన్నో పోరాటాల మలుపులు.. రాజకీయ మజిలీలు ఆయన చరిత్రలో ఉన్నాయి. లై పెట్టి, పోస్టర్ అతికించి, పదకొండు ఏళ్ళు ప్రతిపక్షంలో సవాళ్లను అధిగమిస్తూ ఎదిగాడు. ఇప్పుడు అధికార పార్టీ ఎమ్మెల్యేగా పశ్చిమ నియోజక వర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలతో దూసుకుపోతున్నాడు. నా మెడలో వేరే కండువా ఊహించను అని చెప్తూ... కాంగ్రెస్ పార్టీకి డ్రగ్ అడిక్ట్ అయ్యానని అంటున్నాడు. శనివారం నాడు డిజిటల్ మీడియా ప్రతినిధులతో నాయిని తన అంతరంగాన్ని పంచుకున్నాడు.

- అక్షరశక్తి, ప్రధాన ప్రతినిధి

### మాటేడు నుంచి హన్మకొండకు..

మా అమ్మనాన్న జయమాల-నరేందర్‌రెడ్డి తొర్రూరు మండలం మాటేడులో ఉండేవారని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. అక్కడ తమ కుటుంబానికి ఇప్పటికీ భూములు ఉన్నాయని చెప్పారు. తన తండ్రికి పెళ్లైన తర్వాత హన్మకొండకు వచ్చారని, తాను మిషన్ ఆస్పత్రిలో పుట్టానన్నారు. మా అమ్మనాన్నకు ఇద్దరు సంతానం. నేను పెద్దోడిని, తమ్ముడు ఉన్నాడు. 'మాది రాజకీయ కుటుంబం కాదు. ఇంతకుముందు మా కుటుంబంలో ఎవరూ పాలిటిక్స్‌లో లేరు.

### స్కూల్‌లోనే పోరాటానికి బీజం..

సెయింట్ జాన్స్ స్కూల్‌లో తన విద్యాభ్యాసం ప్రారంభమైందని చెప్పారు. ఆ తర్వాత గౌతమ్ ప్రాక్టిసింగ్ స్కూల్‌లో ఇంగ్లిష్ మీడియంలో చదివించేందుకు తన తండ్రి చేర్పించారని తెలిపారు. ఏడు లేదంటే ఎనిమిదో తరగతిలో ఉన్న సమయంలో జరిగిన ఓ సంఘటన తనకు స్కూల్లో మంచి గుర్తింపు తెచ్చిందన్నారు. ఆగస్టు 15న పాఠశాలలో జెండా వందనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయని, అదే సమయంలో ముగ్గురు వ్యక్తులు వచ్చి త్రివర్ణ పతాకం వద్దని, బ్లాక్ జెండా పెడతామన్నారు. దీనికి ప్రిన్సిపాల్ అంగీకరించకపోవడంతో చిన్నపాటి పెనుగులాట జరిగిందన్నారు. ఈ క్రమంలో ప్రిన్సిపాల్ కిందపడగా తాను వెంటనే స్పందించి వారితో ఫైటింగ్‌కు వెళ్లానని చెప్పారు. ఆ ఘటన తర్వాత స్కూల్లో తన క్రేజ్ పెరిగిపోయిందని, తనకు మంచి ఇమేజ్ వచ్చిందని గుర్తుచేసుకున్నారు. 'సార్లు నన్ను ప్రత్యేకంగా చూస్తుంటే నాకు భలే అనిపించేది' అని నాయిని నవ్వుతూ చెప్పారు. అయితే చదువుపై మాత్రం చిన్నప్పటి నుంచే ఆసక్తి లేదన్నారు. స్కూల్ బంద్ కొట్టి సినిమాలకు వెళ్లేవాడినని చెప్పారు. తమకు సత్యనారాయణ అనే మంచి టీచర్ ఉండేవారని, తాము థియేటర్‌కు వెళ్లిన విషయం తెలుసుకొని అక్కడికే వచ్చి క్లాస్‌రూమ్‌కు తీసుకొచ్చేవారని గుర్తుచేశారు.

### చదువు అబ్బలేదు..

నాకు చిన్నప్పటి నుంచి చదువు అబ్బలేదని నాయిని చెప్పారు. బలవంతంగా చదివినప్పటికీ కష్టంగా పాస్ అయ్యేవాడినన్నారు. ఒకసారి పరీక్షలో సున్నా మార్కులు రావడంతో తన తండ్రి తన తల్లి ముందు తిడుతూ.. 'వీడు చదవడు.. బర్లు కాయడానికి పంపిస్తా' అని అన్నారని గుర్తుచేశారు. తండ్రి నిజంగానే బర్లు కాయడానికి పంపిస్తారని భావించి తాను అందుకు సిద్ధమయ్యానని, అది చూసిన తండ్రి మళ్లీ తనను తిట్టారని చెప్పారు. డిగ్రీలో లెక్చరర్లు ఎంత కష్టపడ్డా తాను పాస్ కాలేదని, నేను.. వాళ్లు ఎంత ప్రయత్నించినా పాస్ కాకపోయానని నవ్వుతూ చెప్పారు. నాకు పుస్తకం అంటేనే పడకపోయేది' అంటూ నాయిని రాజేందర్ రెడ్డి చెప్పుకొచ్చారు.

### యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడే రాజకీయ మలుపు..

తన రాజకీయ జీవితాన్ని మలుపు తిప్పింది యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవేనని నాయిని రాజేందర్ రెడ్డి చెప్పారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పీవీ రంగారావు తనను ప్రోత్సహించారని తెలిపారు. దేవేందర్‌రెడ్డితో పోటీ ఉన్నప్పటికీ ఆయన వర్గాన్ని కాదని తనకు అవకాశం ఇచ్చారని చెప్పారు. విజయవాడలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమరభేరి సభ ఏర్పాటు చేసినప్పుడు తాను 102 వాహనాలను ఏర్పాటు చేశానన్నారు. అందులో 100 సుమోలు, రెండు బస్సులు ఉన్నాయని తెలిపారు. వాటికి తన ఫొటోతో ఫ్లెక్సీలు పెట్టించామని చెప్పారు. ఇక తన స్నేహితుడు గోల్డ్‌స్మిత్ విజయవాడలో ఉండేవాడని, అతనికి ఫోన్ చేసి భోజనాలు, వాటర్ ప్యాకెట్లు ఏర్పాటు చేయాలని, నాలుగు బ్యానర్లు కూడా చేయించి కట్టాలని చెప్పానన్నారు. అయితే తాను చెప్పినదానికంటే రెట్టింపు ఏర్పాట్లు చేశాడని తెలిపారు. జంబో పూలదండ, కటౌట్లు కూడా ఏర్పాటు చేశారని చెప్పారు. తన వెంట రమేశ్‌బాబు, వినోద్‌కుమార్, అజీజ్‌ఖాన్ వచ్చారని తెలిపారు. అయితే నా దోస్తు ఎంత బిల్లు పంపిస్తాడో అని భయపడ్డానని, కానీ ఏమీ పంపలేదన్నారు.



### ఇంటర్‌లోనే రాజకీయ రగడ..

హన్మకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదవిన. తమ స్నేహితులు సీకేఎం కాలేజీలో ఎన్ఎస్‌యూఐ తరపున బ్యానర్లు కట్టేందుకు వెళ్లగా వారిపై ఏబీవీపీ కార్యకర్తలు దాడి చేశారని చెప్పారు. వారిని బురదలో పడేసి తొక్కారని తెలిపారు. దీంతో మరుసటి రోజు తాను 18 మందితో కాలేజీకి వెళ్లానని, అక్కడ ఏబీవీపీకి చెందిన వారు 100 మందికి పైగా ఉన్నారని చెప్పారు. వెనక్కి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఘర్షణ జరిగిందన్నారు. ఆ ఘటన అప్పట్లో పత్రికల్లో సంచలనం సృష్టించిందని, తమపై కేసులు నమోదయ్యాయని తెలిపారు. అప్పట్లో బస్వరాజు సారయ్య పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడి తమను కొట్టకుండా కాపాడారని గుర్తుచేశారు.

### డిగ్రీలోనే ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు..

1988లో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో డిగ్రీలో చేరానని నాయిని తెలిపారు. అందులో సీటు రావడం కూడా పెద్ద మిస్టరీ అని నవ్వుతూ చెప్పాడు. కాలేజీలో చేరిన మూడు నెలలకే తనపై దాడి జరిగిందన్నారు. అప్పట్లో వడ్డేపల్లి ప్రాంతానికి చెందిన వారంటే భయం ఉండేదని, తాను మాత్రం మామూలుగానే ఒక టీం మెయింటెయిన్ చేసేవాడినని చెప్పారు. అది కొందరికి నచ్చలేదన్నారు. తనపై దాడి చేస్తే రివెంజ్ తీర్చుకుంటానన్న విషయం వారికి కూడా తెలుసని చెప్పారు. రెండు మూడు రోజులు ఓపిక పట్టిన తర్వాత గ్రౌండ్‌లో దొరికిన వారిని దొరికినట్టుగా హాకీ స్టిక్స్‌తో కొట్టానని తెలిపారు. ఆ ఘటన తర్వాత డిగ్రీ ఫస్టియర్‌లోనే తనకు ఎన్ఎస్‌యూఐ కాలేజీ అధ్యక్ష పదవి ఇచ్చారని చెప్పారు. ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా విద్యార్థుల సమస్యలపై నిలదీసేవాడినని, దీంతో కాలేజీ నుంచి తనను బయటకు పంపేందుకు శతవిధాలా ప్రయత్నాలు జరిగాయని తెలిపారు.

### కిన్నెర హోటల్ మా అడ్డా..

పబ్లిక్ గార్డెన్ సమీపంలోని కిన్నెర హోటల్ వద్ద ఎన్ఎస్‌యూఐ, ఏబీవీపీ కార్యకర్తల అడ్డాలు ఉండేవని నాయిని తెలిపారు. కోహినూర్ హోటల్ వద్ద టీడీపీ కార్యకర్తలు ఉండేవారని చెప్పారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా అప్పట్లో హన్మకొండలో ఎన్ఎస్‌యూఐ, ఏబీవీపీ కార్యాలయాలు పక్కపక్కనే ఉండేవని గుర్తుచేశారు. తాము కార్యాలయాల్లో బియ్యం బస్తాలు తెచ్చి పెట్టుకునేవాళ్లమని చెప్పారు. అప్పట్లో రామకృష్ణ పరమహంస అనే డీఎస్పీ రాత్రి సమయంలో కార్యాలయం వద్దకు నలుగురు పోలీసులను సెక్యూరిటీగా పంపేవారని తెలిపారు. 'అప్పుడు యుద్ధ వాతావరణం లెక్క ఉండేది' అని అన్నారు. 12వ డివిజన్ కార్పొరేటర్ పదవికి కాంగ్రెస్ నుంచి ఎర్ర ప్రకాశ్‌రెడ్డి, మరో పార్టీ నుంచి రావు అమరేందర్‌రెడ్డి పోటీ చేశారని చెప్పారు. ఆ ఎన్నికల ప్రచారంలోనూ ఫైటింగ్ జరిగిందని, అదే సమయంలో తనపై తొలిసారి రాజకీయ కేసు నమోదైందని తెలిపారు. ఆ కేసును కూడా బస్వరాజు సారయ్యే డీల్ చేశారని చెప్పారు.

### 'పని చేసే అధ్యక్షుడు'..

ఆ తర్వాత ఉమ్మడి వరంగల్ జిల్లాకు తనను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, పుల్లా భాస్కర్‌ను అధ్యక్షుడిగా ప్రకటించారని నాయిని చెప్పారు. అప్పటి జిల్లా ఇన్‌చార్జి తనను 'పని చేసే అధ్యక్షుడు' అని సరదాగా పిలిచేవారని ఆయన గుర్తు చేసుకున్నారు. హయగ్రీవాచారి, తరాల దేవేందర్‌రెడ్డి తన రాజకీయ గురువులని, వారి నీడలోనే తాను రాజకీయంగా ఎదిగానని చెప్పారు. సిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎనిమిదేళ్లు పనిచేశానన్నారు. 2005లో లైబ్రరీ చైర్మన్‌గా పని చేశానని తెలిపారు. 2014లో పొన్నాల లక్ష్మయ్య పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో తాను డీసీసీగా పని చేశానన్నారు. కాకతీయ ఆటో యూనియన్, మెడికల్ అండ్ హెల్త్ తదితర సుమారు 20 సంఘాలకు గౌరవ అధ్యక్షుడిగా ఉన్నానని తెలిపారు.

### 2004 నుంచే టికెట్ వేట..

అసెంబ్లీ టికెట్ కోసం 2004లోనే అడిగానని నాయిని చెప్పారు. అప్పట్లో టీఆర్ఎస్‌కాంగ్రెస్ పొత్తులో వరంగల్ పశ్చిమ సీటు టీఆర్ఎస్‌కు వెళ్లడంతో సత్యనారాయణరెడ్డికి టికెట్ వచ్చిందన్నారు. 2009లో దయాసాగర్‌కు టికెట్ కేటాయించారని, 2014లో పార్టీ ఎర్రబెల్లి స్వర్ణకు అవకాశం ఇచ్చిందని చెప్పారు. 2018లో మహాకూటమి అభ్యర్థిగా రేవూరి ప్రకాశ్‌రెడ్డి బరిలో నిలిచారని తెలిపారు.

### 2009లో టికెట్ కన్ఫాం.. చివర్లో కోత..

2009లో రాహుల్‌గాంధీ యూత్ కాంగ్రెస్ కోటాలో తనకు టికెట్ ఖరారైందని నాయిని తెలిపారు. బక్క జడ్సన్ నా ఫోన్ నుంచి దరఖాస్తు చేయగా జితేందర్‌సింగ్ నుంచి 'మీకు టికెట్ కన్ఫాం' అంటూ మెసేజ్ వచ్చిందన్నారు. ఆ మెసేజ్ అర్థం కాక ఆ నంబర్‌కు ఫోన్ చేస్తే ఢిల్లీలోని నంబర్ అని తెలిసిందన్నారు. వెంటనే ఢిల్లీ వెళ్లి టికెట్ విషయాన్ని కన్ఫాం చేసుకున్నానని చెప్పారు. యూత్ కోటాలో తనతో పాటు ఏడుగురికి టికెట్లు కేటాయించినప్పటికీ ఢిల్లీలో జరిగిన మంతనాల తర్వాత తన టికెట్ తీసేశారని తెలిపారు. 'ఇదేంటని అడిగితే వైఎస్ నా భుజంపై చేయి వేసి చెప్పకనే చెప్పారు' అని నాయిని గుర్తుచేశారు.

### 2023లో టికెట్ కోసం మళ్లీ పోరాటం..

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నో కుట్రలను ఛేదించి టికెట్ తెచ్చుకున్నానని నాయిని తెలిపారు. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వచ్చిన తర్వాత పీసీసీ అధ్యక్షుడయ్యారని, ఆయనను కలిసి టికెట్ ఇస్తే కష్టపడి పనిచేస్తానని చెప్పానన్నారు. '2009 నుంచి టికెట్ చేజారిపోతోంది. నేను కష్టపడి పనిచేసే సమయానికి వేరే వాళ్లు రావడం పరిపాటిగా మారింది. నాకు టికెట్ కన్ఫాం చేస్తే నా పనిలో నేను ఉంటానని చెప్పా' అని తెలిపారు. సర్వే రిపోర్టు వచ్చిన తర్వాత చెబుతానని రేవంత్‌రెడ్డి చెప్పారని, సర్వే రిపోర్టు రాగానే ముందుకు వెళ్లాలని సూచించారని చెప్పారు. ఫస్ట్ లిస్ట్‌లో తన పేరు రావాల్సి ఉన్నప్పటికీ కొందరు అడ్డుకున్నారని ఆరోపించారు. అధిష్ఠానం వద్ద తనపై ఏవేవో చెప్పారని, దీంతో రీసర్వేలు, స్పాట్ సర్వేలు నిర్వహించిన తర్వాత చివరకు తనకు టికెట్ ఇచ్చారని తెలిపారు.

### సొంత పార్టీలోనూ తొక్కే ప్రయత్నం..

రాజకీయ జీవితంలో ప్రత్యర్థుల నుంచే కాకుండా సొంత పార్టీలోనూ తనను తొక్కే ప్రయత్నాలు జరిగాయని నాయిని అన్నారు. 'వీడు వస్తే మాకు రాజకీయ భవిష్యత్ ఉండదు' అని అనుకునే వాళ్లు కూడా ఉన్నారు. సొంత పార్టీలోనే నన్ను తొక్కే ప్రయత్నాలు చేశారు. అయినా నేను వెనక్కి తగ్గలేదు' అని చెప్పారు.

### పార్టీ మారమని ప్రలోభాలు..

తనపై కేసులు పెట్టి వేధించిన సందర్భాల్లో పార్టీ మారితే కేసులన్నీ మాఫీ చేస్తామని చాలా ప్రలోభాలు పెట్టారని నాయిని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ, సొంత పార్టీ కాంగ్రెస్‌లోనూ కొట్లాటలు ఉన్నాయంటూ పార్టీ మారాలని రాత్రిళ్లు ఇంటికి వచ్చి మరీ కొందరు అడిగేవారని చెప్పారు. తనపై ఇప్పటికీ 54 కేసులు ఉన్నాయని, మర్డర్ కేసులోనూ ఇరికించారని తెలిపారు. కుటుంబంలో విషాదం జరిగిన సమయంలో కూడా కేసుల కారణంగా తప్పించుకుని తిరగాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. 'ఎన్ని కేసులు పెడతారో పెట్టుకోండి.. నేను పార్టీ మారను అని చెప్పా. నా మెడలో కాంగ్రెస్ కండువా తప్ప మరో కండువాను నేను ఊహించుకోలేదు' అని నాయిని స్పష్టం చేశారు. మర్డర్ కేసులో ఇరికించిన సమయంలో సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలో మాదిరిగా పోలీసులకు చిక్కకుండా తిరిగానని, ఆ ఘటనలను ఎన్నటికీ మరిచిపోలేనన్నారు.

### 'వేస్ట్ గాళ్ల వల్లే ఆ పార్టీ బతుకుతోంది'

పార్టీ మారమనే ఒత్తిళ్ల నేపథ్యంలో ఒక పెద్ద మనిషి తన గురించి చేసిన వ్యాఖ్యను కూడా నాయిని గుర్తుచేశారు. 'ఇలాంటి వేస్ట్ గాళ్ల వల్లనే ఆ పార్టీ ఇంకా బతుకుతోంది' అని ఓ పెద్దమనిషి అన్నారని, అది తిట్టు లాంటి పొగడ్తగా భావించానని నాయిని చెప్పారు.

### రాహుల్ నుంచి నేరుగా ఫోన్..

ఒక రోజు కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా రాహుల్‌గాంధీ నుంచి ఫోన్ వచ్చిందని నాయిని తెలిపారు. ఢిల్లీకి రావాలని పిలిచారని చెప్పారు. దేశవ్యాప్తంగా పది జిల్లాలను ఎంపిక చేస్తే తెలంగాణ నుంచి తనను ఒక్కరినే సమావేశానికి పంపించారని తెలిపారు. సమావేశంలో తనకు 45 నిమిషాల సమయం ఇచ్చారని, డీసీసీలకు మరిన్ని అధికారాలు ఇవ్వాలని అప్పుడే సూచించానని చెప్పారు. ప్రస్తుతం రాహుల్‌గాంధీ వాటిని అమలు చేస్తున్నారని తెలిపారు. మరోసారి రాహుల్‌గాంధీ, కొప్పుల రాజు ఆన్‌లైన్‌లో డీసీసీ సమావేశం నిర్వహించారని, అందులో మాట్లాడమన్న వారే మాట్లాడాలని నిబంధన ఉండేదన్నారు. అప్పుడు రాహుల్‌గాంధీ 'నాయిని రాజేందర్‌రెడ్డి జీ మాట్లాడండి' అని తనను పిలవడం ఎంతో గర్వంగా అనిపించిందన్నారు.

### మానాన్నను డబ్బులు అడగడం మానేశా..

ఇంటర్‌లో ఉన్న సమయంలో చదువు అబ్బడం లేదని, బిజినెస్ చేసుకుంటానని డబ్బులు ఇవ్వాలని తండ్రిని అడిగానని నాయిని తెలిపారు. ఆయన డబ్బులు ఇవ్వనని చెప్పారని, అప్పటి నుంచి తండ్రిని డబ్బులు అడగడమే మానేశానన్నారు.

### 'నాకు పిల్లనియ్యలే'..

తాను రఫ్‌గా ఉండేవాడినని నాయిని చెప్పారు. తనపై రెండు కేసులు నమోదవడంతో 'నరేందర్‌రెడ్డి పెద్ద కొడుకుపై మర్డర్ కేసు అయిందట' అంటూ ప్రచారం జరిగిందన్నారు. దీంతో చుట్టాలు పక్కాలు కూడా అదే విషయాన్ని మాట్లాడుకునేవారని చెప్పారు. అప్పట్లో పట్టింపులు ఎక్కువగా ఉండేవని, కేసులు ఉన్నాయనే కారణంతో తనకు పిల్లను ఇవ్వడానికి కూడా ఎవరూ ముందుకు రాలేదన్నారు.

### అప్పటి రాజకీయాలు వేరు..

ప్రస్తుతం రాజకీయాల్లో విలువలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయని నాయిని అన్నారు. అప్పట్లో రాజకీయ ప్రత్యర్థులను కూడా గౌరవించుకునే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు వ్యక్తిగత విమర్శలు ఎక్కువయ్యాయని చెప్పారు. దీనికి ఉదాహరణగా నర్సంపేట ఎమ్మెల్యేగా పనిచేసిన ఓంకార్ ఘటనను ప్రస్తావించారు. ఓంకార్‌పై ఫైర్ కావడంతో ఆయన్ను ఎంజీఎంకు తీసుకొచ్చారని, నర్సంపేట నుంచి ఇసుకేస్తే రాలనంత జనం వచ్చారని తెలిపారు. అప్పటికే రాజకీయాల్లో హత్యలు కూడా జరిగేవని, హయగ్రీవాచారిని ప్రత్యర్థులు 'హత్యలాచారి' అని పిలిచేవారని చెప్పారు. అయినప్పటికీ హయగ్రీవాచారి ఎంజీఎంకు వెళ్లి ఓంకార్‌ను పరామర్శించారని గుర్తుచేశారు. అంతా మా మీద దాడి చేస్తారనుకున్నామని, కానీ అంత మంది ఆయనను చూసి దారి ఇవ్వడం గొప్పగా అనిపించిందని చెప్పారు. 'అప్పుడు అలాంటి రాజకీయ వాతావరణం ఉండేది. ఇప్పుడు ఎవరో పోటీకి వస్తాడేమోనని ముందే శత్రువుగా చూస్తున్నారు' అని నాయిని అన్నారు.

### పావలా ఇడ్లీ నుంచి వెయ్యి రూపాయల ఇడ్లీ వరకు..

తన రాజకీయ ప్రస్థానంలో ఎదురైన అనుభవాలన్నీ గొప్పవేనని నాయిని చెప్పారు. పోరాటంలో ఉన్న సమయంలో పావలా ఇడ్లీ తిన్నానని, ఇప్పుడు వెయ్యి రూపాయల ఇడ్లీ తినే స్థాయికి వచ్చానని అన్నారు. కానీ అప్పుడున్న రాజకీయ సంస్కారం ఇప్పుడు లేదు' అని నాయిని చెప్పారు.

### వరంగల్ బ్రాండ్ పెంచడమే లక్ష్యం..

తన నియోజకవర్గ పరిధికే పరిమితం కాకుండా వరంగల్ బ్రాండ్‌ను పెంచే పనులకు ముఖ్యమంత్రి వద్ద నిధులు అడిగానని నాయిని తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, మామునూరు ఎయిర్‌పోర్టు, రింగ్‌రోడ్డు వంటి పనులు చేపట్టాలని కోరానన్నారు. రూ.500 కోట్లతో వాటర్ సప్లై పైప్‌లైన్‌ను మెరుగుపరుస్తున్నామని, రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు ప్రారంభించామని తెలిపారు. ఐటీఐ కాలేజీకి రూ.25 కోట్లు తీసుకొచ్చానన్నారు. కాజీపేట బ్రిడ్జి పనులు తాను ఎమ్మెల్యేగా వచ్చిన తర్వాతే వేగం పుంజుకున్నాయని, త్వరలోనే పనులు పూర్తి చేస్తామని చెప్పారు. కాజీపేట బస్టాండ్ కూడా మంజూరు చేయించానని తెలిపారు.

### 'నాకు ఏది వచ్చినా బోనస్సే'

అసెంబ్లీలో కూర్చోవాలనే కోరిక ఉండేదని, అది నెరవేరిందని నాయిని చెప్పారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కావాలని అడిగాను. 'నాకు పని చేయడం అంటే ఇష్టం. అందుకే నేను పార్టీ పదవి అడిగాను. పెద్దలు ఏ పదవి ఇచ్చినా నాకు బోనస్సే' అని నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు.

### బిడ్డకు టికెట్ ఇస్తే.. బరిలోకి

తన బిడ్డ గోదాదేవి మంచి డాక్టర్. ఆమె 2014లో కాంగ్రెస్ సభ్యత్వం తీసుకుందని నాయిని తెలిపారు. ప్రస్తుతం ఎస్ఐఆర్ ప్రక్రియలో కీలకంగా పనిచేస్తోందన్నారు. 240 మంది బీఎల్ఓలు, 240 బీఎల్ఏలను సమన్వయం చేసిందని చెప్పారు. ప్రత్యేక వింగ్ ఏర్పాటు చేసి వరంగల్ పశ్చిమలో ఎస్ఐఆర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఓట్లు కోల్పోకుండా పనిచేస్తోందన్నారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ ఆదేశిస్తే గోదాదేవి తప్పకుండా పోటీ చేస్తుందని తెలిపారు.

### కార్పొరేషన్ రిజర్వేషన్లు మారొచ్చు..

డిసెంబర్ లేదా జనవరిలో గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని ఎమ్మెల్యే నాయిని చెప్పారు. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ రిజర్వేషన్లు మారే అవకాశం ఉందన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన కార్పొరేషన్ల నేపథ్యంలో మరోసారి రిజర్వేషన్లలో మార్పులు చేసే అవకాశం ఉందని, డివిజన్ల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉందని తెలిపారు.



### 'దక్కముక్కలు తింటేనే తెలుస్తుంది'

తాను హైస్పీడ్, టఫ్‌గా ఉంటానని నాయిని అన్నారు. ఒకసారి స్నేహితులతో కలిసి ఐదు బైక్‌లపై ఢిల్లీకి వెళ్లాలని ప్లాన్ చేశామని చెప్పారు. ఈ విషయాన్ని తల్లికి చెప్పినా ఆమె అడ్డుచెప్పలేదన్నారు. తర్వాత ఓ సందర్భంలో బైక్‌పై ఢిల్లీ వెళ్తానని చెప్పినా ఎందుకు అడ్డు చెప్పలేదని తల్లిని అడిగానన్నారు. అందుకు ఆమె.. 'దక్కముక్కలు తింటూ పెరిగితేనే జీవితంలో అన్నీ తెలుస్తాయి' అని చెప్పిందని నాయిని గుర్తుచేశారు.

### ఫైటింగ్‌ల జీవితమే..

రాజకీయాల్లో అడుగుపెట్టిన నాటి నుంచి నా ప్రయాణమంతా దాడులు, ప్రతి దాడులు, కేసులు, పోరాటాలతోనే సాగిందని నాయిని రాజేందర్ రెడ్డి చెప్పారు. విద్యార్థి దశలో ఎన్ఎస్‌యూఐ కోసం ప్రత్యర్థులతో తలపడ్డాను. రాజకీయాల్లోనూ ఘర్షణలు, కేసులు ఎదుర్కొన్నా. సొంత పార్టీలోనే తొక్కే ప్రయత్నాలు జరిగాయి. పార్టీ మారితే కేసులు మాఫీ చేస్తామన్న ప్రలోభాలనూ లెక్కచేయలేదన్నారు. పోరాటమే తన రాజకీయ ప్రస్థానానికి పునాది అని చెప్పేలా ఆయన జీవితం సాగిందని చెప్పారు.